సాక్షి
వనపర్తి
గురువారం ¦ 20 ¦ ఫిబ్రవరి ¦ 2025



.. నిర్వాసితుల ఆందోళన

ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల ఆందోళన రోజురోజుకు ఉధృతం అవుతోంది.

వివరాలు 8లో ▸



.. పోలేపల్లి ఎల్లమ్మ తల్లి

పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ జాతర గురువారం నుంచి 24వ తేదీ వరకు కొనసాగనుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.5/18.5

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కస్తూర్బా విద్యాలయం తనిఖీ



చిన్నంబావి: మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం మండల ప్రత్యేకాధికారి రఘునాథ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించి తీసుకుంటున్న జాగ్రత్తలు, మెనూ అమలును అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు, రికార్డులను పరిశీలించారు. పదోతరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితరాలపై ఆరా తీశారు. అలాగే మండలంలోని కొప్పునూరు ఎస్సీ వసతిగృహాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయొద్దు



వనపర్తి టౌన్: ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేయడం నిబంధనలకు విరుద్ధమని పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో భాగంగా బుధవారం ఆయన పుర సిబ్బందితో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించగా చాలా దుకాణాలకు లైసెన్స్ లేదని గుర్తించారు. కలెక్టరేట్ మార్గంలో ఉన్న దుకాణాదారులు కూడా ట్రేడ్ లైసెన్స్ తీసుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. కొందరు దుకాణాదారులు గడువు కావాలని కోరగా, మరికొందరు లైసెన్స్ ఫీజు అధికంగా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు దుకాణదారులు లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని, అలాంటి వారికి నోటీసులిచ్చామని, గడువు ముగిసిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల కొలతల ఆధారంగా ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూలు ప్రక్రియ వేగవంతం చేశామని, రోజు రూ.లక్ష లక్ష్యంగా కాగా అందుకు చేరువగా వసూలు చేస్తున్నామన్నారు. పుర సిబ్బంది చేతికి డబ్బులు ఇవ్వొద్దని.. ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసి వెంటనే రసీదు పొందవచ్చని సూచించారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన అడిషనల్ కమాండెంట్



వనపర్తి విద్యావిభాగం: మండలంలోని చిట్యాల సమీపంలో ఉన్న చేయూత అనాథ ఆశ్రమంలోగల వృద్ధాశ్రమానికి బుధవారం 10వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ జయరాజ్, అసిస్టెంట్ కమాండెంట్ పి.శ్రీనివాసులు సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులను అభినందించి నిత్యావసర సరుకులు అందజేశారు. వారి వెంట రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్పీ సింగ్, ఆర్ఎస్ఐ శ్రీకాంత్, బోజ్యానాయక్, ఏఆర్ఎస్ఐ జయవర్ధన్‌చారి, భీమయ్య, అశోక్, రవీంద్రనాయక్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

మన్యంకొండ హుండీ లెక్కింపు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీలను లెక్కించగా.. రూ. 32,39,301 ఆదాయం వచ్చింది. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఉదయం 10 గంటలకు ప్రారంభమై.. రాత్రి 7 గంటలకు ముగిసింది. హుండీ లెక్కింపులో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు వెంకటాచారి, శ్రావణ్‌కుమార్, మంజుల, సుధ, ఐడీబీఐ మేనేజర్ రాజవర్ధన్ రెడ్డి, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



సాగునీటి కోతలు



జూరాల జలాశయంలో నీటిమట్టం

జూరాల ఆయకట్టుకు వారంలో రెండ్రోజులే నీటి సరఫరా

- అసలే వారబందీ.. ఆపై కుదింపు
- యాసంగి సాగుకు తప్పని కష్టాలు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

అమరచింత: జూరాల జలాశయం ఆయకట్టుకు యాసంగిలో వారబందీ విధానంలో అధికారులు సాగునీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నిల్వ నీటిమట్టం రోజురోజుకు తగ్గుముఖం పడుతుండటంతో ఇక నుంచి వారంలో రెండ్రోజులే సాగునీరు వదలాలని నిర్ణయించారు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులో నిల్వ నీటిమట్టం తగినంత లేదని ఈసారి యాసంగి సాగు ఆయకట్టును 34,246 ఎకరాలకు కుదించిన విషయం తెలిసిందే. ఎడమ కాల్వ విభాగంలో రామన్‌పాడు రిజర్వాయర్ వరకు ఉన్న అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని 20 వేల ఎకరాలకు మాత్రమే సాగునీటిని అందిస్తామని ప్రాజెక్టు అధికారులు ప్రకటించడంతో పాటు ఆయా ప్రాంతాల రైతులకు సైతం సాగు ప్రారంభంలోనే అవగాహన కల్పించారు. గతేడాది కూడా యాసంగిలో అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈసారి



అమరచింత శివారులో సాగు చేసిన వరిపంట

వానాకాలంలో ఎగువ నుంచి తగినంత వరద వచ్చినా ప్రాజెక్టులో ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోకపోవడంతో ఈ దుస్థితి తలెత్తిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారంలో రెండ్రోజులే..

జూరాల ఆయకట్టుకు వారంలో రెండ్రోజులే నీటిని అందించేందుకు సిద్ధమయ్యారు. మంగళ, బుధవారం నీటిని సరఫరా చేసి మిగిలిన రోజులు నిలిపివేయనున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు. గతంలో వారబందీ విధానంలో వారంలో 4 రోజులు సాగునీటిని అందించి, మూడు రోజులు నిలిపివేసేవారని.. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇటు పంటలకు, అటు తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ప్రాజెక్టులో 5.256 టీఎంసీలు..

ప్రస్తుత యాసంగిలో జూరాల జలాశయం ప్రధాన కుడి కాల్వ కింద సుమారు 15 వేల ఎకరాలు, ప్రధాన ఎడమ కాల్వల కింద రామన్‌పాడు జలాశయం వరకు సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా అధికారులు ప్రణాళిక ఖరారు చేశారు. ఇందుకుగాను 4.93 టీఎంసీల నీటిని కేటాయించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.256 టీఎంసీల నీరు ఉండగా.. ఇందులో 2.593 టీఎంసీలను వేసవిలో తాగునీటి అవసరాలకు వినియోగించేందుకు కేటాయించారు. తాగు, సాగునీటి అవసరాలను పరిగణలోకి తీసుకున్న అధికారులు ముందస్తుగా వారబందీని అమలు చేస్తూ వచ్చారు.



ఎడమకాల్వలో నిలిచిన నీటి సరఫరా

రెండ్రోజులు సరికాదు..



యాసంగిలో జూరాల ఎడమకాల్వ ద్వారా రామన్‌పాడు వరకు మాత్రమే నీటిని అందిస్తామని అధికారులు ప్రకటించారు. అమరచింత ఎత్తిపోతల పథకం నుంచి సాగు నీరు వదులుతుండటంతో 4 ఎకరాల్లో వరి సాగుచేశా. వారబందీ విధానంలో 5 రోజులు సాగునీరు వదులుతున్నా పంటలకు సరిపడా అందక ఇబ్బందులు పడుతున్నాం. అలాంటిది ఇకపై వారంలో రెండు రోజులు మాత్రమే అందిస్తామని చెప్పడం సరికాదు.

– వెంకట్‌రెడ్డి, రైతు, అమరచింత

రైతులను ఆగం చేయడమే..



అమరచింత ఎత్తిపోతల పథకం కింద ఐదు ఎకరాల్లో వరి సాగుచేశా. ఎత్తిపోతలకు జూరాల నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. వారంలో 5 రోజులు నీటిని అందిస్తున్నా పుష్కలంగా అందడం లేదని దిగాలుతో ఉన్నాం. అలాంటిది 2 రోజులు మాత్రమే వదలడమంటే రైతులను ఆగం చేయడమే.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అమరచింత

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



జూరాల జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతుంది. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగొద్దనే ఇకపై వారంలో రెండ్రోజులు మాత్రమే సాగునీటిని వదలాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ విషయాన్ని కుడి, ఎడమ కాల్వల ఆయకట్టు రైతులకు తెలియజేయాలని సంబంధిత ఏఈలకు వివరించాం. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.256 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రభుత్వం ముందుచూపుతో సాగునీటిని పొదుపుగా ఇవ్వాలని నిర్ణయించింది.

– జుబేర్ అహ్మద్, ఈఈ, జూరాల ప్రాజెక్టు, గద్వాల డివిజన్

ఇసుక రీచ్‌లపై పర్యవేక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలోని ఇసుక రీచ్‌లపై ఆయా ప్రాంతాల తహసీల్దార్ల పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం పెబ్బేరు మండలం వై–శాఖాపురం గ్రామ సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌ను, రాంపురం గ్రామ శివారులో అధికారులు సీజ్ చేసిన ఇసుక నిల్వలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక నిల్వలు చేసినా, సరఫరా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాంపురంలో ఇసుక నిల్వల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కలెక్టర్ వెంట పెబ్బేరు తహసీల్దార్ లక్ష్మి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలి..

జిల్లాలో ఎంపిక చేసిన 15 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో వెబెక్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా నిర్మాణం చేసుకునే వారికే పథకం వర్తిస్తుందని.. ఇదివరకు సగం నిర్మించుకున్న వారికి వర్తించదని వివరించాలని సూచించారు. ఇంటి నిర్మాణం ప్రారంభించే సమయంలో పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని, తహసీల్దార్లు సైతం దగ్గర్లోని రీచ్ నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. విడతల వారీగా నగదు ప్రభుత్వం నుంచి వస్తుందని వారికి స్పష్టంగా తెలియజేయాలని కోరారు. మిగతా గ్రామాల్లో కూడా పథకం ఏ క్షణమైనా ప్రారంభమయ్యే అవకాశం ఉందని.. అర్హుల జాబితాను మరోమారు పరిశీలించి తుది జాబితా సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓలకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో అనర్హులు జాబితాలో లేకుండా చూసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యలు రానివ్వొద్దు..

వేసవి సమీపిస్తున్నందున గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడకుండా.. ప్రత్యామ్నాయ పరిస్థితుల్లో స్థానికంగా ఉండే బోర్లను వినియోగించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లోని బోర్లు,మోటార్లు, చేతిపంపులు పనిచేయకుండా ఉంటే వెంటనే మరమ్మతులు చేయించి సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటిట్యాంకులు పరిశుభ్రంగా ఉండాలని, పదిరోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ట్యాంకర్లను సైతం అవసరానికి అనుగుణం సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, డీపీఓ సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్, హౌసింగ్ అధికారులు విఠోభా, పర్వతాలు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



చెన్నూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

- మార్చి 15 నాటికి బేస్‌మెంట్ లెవల్ పూర్తికావాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

గోపాల్‌పేట: మండలంలోని చెన్నూరుకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించి మార్చి 15 నాటికి బేస్‌మెంట్ లెవెల్ వరకు పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కోరారు. బుధవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా చెన్నూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించి ఆవరణను పరిశీలించారు. మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని, మెనూ విధిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. తర్వాత బుద్దారం గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీచేసి వంటగదిని పరిశీలించారు. బియ్యం, కూరగాయలు చూసి మెనూ పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి బోధన వివరాలు తెలుసుకొని వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం తాడిపర్తిలో వైకుంఠధామాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడి నీటి సరఫరా, ఇతర సమస్యలపై ఆరా తీశారు. నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఇతర మండలాల అధికారులు ఉన్నారు.

22న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల రాక

ఖిల్లాఘనపురం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ నెల 22న మండలానికి వస్తున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఖిల్లాఘనపురం, గోపాల్‌పేట మండలాలకు దూరమవుతున్నందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారి కోరిక మేరకు పెద్దమందడి, ఖిల్లాఘనపురం రెండు మండలాలకు కలిపి మండల కేంద్రంలో నూతన వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. షాపురం గ్రామానికి వెళ్లే కూడలి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్కెట్‌యార్డు ఏర్పాటుకు మంత్రి భూమిపూజ చేస్తారని వివరించారు. అలాగే గోపాల్‌పేటలో కూడా మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మండలానికి వ్యవసాయ మార్కెట్‌యార్డును మంజూరు చేసినందుగాను పలువురు నాయకులు, రైతులు, వ్యాపారులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు.

ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమిపూజ..

కొత్తకోట: మండలంలోని సంకిరెడ్డిపల్లిలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణానికి ఈ నెల 22న మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు సీడీసీ చైర్మన్ గొల్లబాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పునరావాసానికి సన్నద్ధం

- నల్లమల అడవి నుంచి చెంచుపెంటల తరలింపునకు కొనసాగుతున్న కసరత్తు
- మొదటి విడతలో కుడిచింతలబైలు, సార్లపల్లి, వటవర్లపల్లి గ్రామాలు
- ఎన్టీసీఏ ద్వారా ప్రత్యేక పునరావాస ప్యాకేజీ
- పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద ఏర్పాట్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్న చెంచుపెంటల తరలింపునకు అవసరమైన చర్యలను అటవీశాఖ వేగవంతం చేసింది. ఇప్పటికే కోర్ ఏరియాలో ఉన్న సార్లపల్లి, కుడిచింతల్‌బైల్, వటవర్లపల్లి గ్రామాలను ఖాళీ చేయించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ(ఎన్టీసీఏ) ద్వారా బాధితులకు పునరావాస ప్రత్యేక ప్యాకేజీని అందజేయనున్నారు. కేంద్రం నుంచి ఆమోదం లభించిన వెంటనే అధికారులు పునరావాస ప్రక్రియను మొదలుపెట్టనున్నారు. మరో రెండు నెలల్లోనే పునరావాసానికి పూర్తిస్థాయి అనుమతులు లభిస్తాయని భావిస్తున్నారు.

విడతల వారీగా చెంచుపెంటల తరలింపు..

నల్లమల అటవీప్రాంతంలో ఉన్న పులులు, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా పరిధిలో ఉన్న చెంచుపెంటలను ఖాళీ చేయించి, అడవి బయట వారికి పునరావాసం కల్పించేందుకు అటవీశాఖ సిద్ధమవుతోంది. ప్రధానంగా పెద్దపులుల సంరక్షణ, వాటికి స్వేచ్ఛగా సంచరించేందుకు వీలు కల్పించడం, వన్యప్రాణులకు, మనుషులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని నిరోధించడంలో భాగంగా పునరావాస ప్రక్రియను చేపడుతున్నట్లు అటవీశాఖ చెబుతోంది.



కుడిచింతల్‌బైలులో ఆర్డీటీ నిర్మించిన చెంచుల ఆవాసాలు

ఇప్పటికే ఇందుకోసం ప్రక్రియను ప్రారంభించగా, తొలి విడతగా తరలించనున్న సార్లపల్లి, కుడిచింతలబైలు, వటవర్లపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించి, స్థానికుల నుంచి అంగీకార పత్రాలను తీసుకుంటున్నారు. స్వచ్ఛందంగా తరలింపునకు ఒప్పుకున్న వారికే పునరావాస ప్యాకేజీని అమలు చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని బలవంతం చేయబోమని అటవీ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ స్థానిక చెంచుల్లో మాత్రం భయాందోళనలు నెలకొన్నాయి.

తొలి విడతలో మూడు గ్రామాలు..

నల్లమల అటవీ ప్రాంతంలోని కోర్ ఏరియాలో ఉన్న సుమారు 20 వరకు చెంచుపెంటలను విడతల వారీగా ఖాళీ చేయించి మరో చోట పునరావాసం కల్పించాలని అటవీశాఖ భావిస్తోంది. వీటిలో మొదటి విడతగా సార్లపల్లి, కుడిచింతల్‌బైల్, వటవర్లపల్లి గ్రామాలను ఖాళీ చేయించాలని నిర్ణయించింది. ఇందుకోసం క్షేత్రస్థాయి సర్వేతో పాటు కుటుంబాల నుంచి అంగీకార పత్రాలను సేకరిస్తోంది. సార్లపల్లిలో మొత్తం 269 కుటుంబాలు ఉండగా, వీరిలో 83 కుటుంబాలు మాత్రమే చెంచులు కాగా, మిగతా ఇతర వర్గాలకు చెందినవారు ఉన్నారు. వీరిలో ఇతర వర్గాలు మాత్రమే తరలింపునకు అంగీకారం చెబుతుండగా, మెజార్టీ చెంచులు ఒప్పుకోవడం లేదు.

ప్యాకేజీ కింద 5 ఎకరాలు.. లేదంటే రూ.15 లక్షలు

అడవిని ఖాళీ చేసి మరో చోటుకు తరలుతున్న స్థానికులకు పునరావాసం కింద ఎన్టీసీఏ ప్రత్యేక ప్యాకేజీని అందిస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పునరావాస ప్యాకేజీ, లేదా 5 ఎకరాల భూమి కేటాయిస్తుంది. ఈ రెండింటిలో ఏదైనా ప్యాకేజీని బాధితులు ఎంచుకోవచ్చు. ఖాళీ చేయనున్న గ్రామస్తులకు పునరావాసం కల్పించేందుకు పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద ఇప్పటికే భూమిని గుర్తించారు. అక్కడే పునరావాస కాలనీలను ఏర్పాటు చేసి నిర్వాసితులకు ఇళ్లు, పాఠశాల, రోడ్లు, ఇతర మౌలిక వసతులను కల్పించనున్నారు.



సార్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

సక్రమంగా ఇస్తేనే వెళతాం..



ఎన్నాళ్ల నుంచో అడవినే నమ్ముకుని ఉంటున్నాం. పులులు, వన్యప్రాణుల సంరక్షణకు మా ఊరిని ఖాళీ చేసి మరో చోటికి పంపిస్తాం అంటున్నారు. పునరావాసం కింద నష్టపరిహారాన్ని అందించి, అక్కడ సౌకర్యాలు కల్పించిన తర్వాతే వెళతాం. అందరికీ న్యాయమైన పరిహారాన్ని అందించి పునరావాస ప్రక్రియ చేపట్టాలి.

– మండ్లి భౌరమ్మ, కుడిచింతల్‌బైల్, అమ్రాబాద్ మండలం

జీవనోపాధి కల్పించాలి..



ఏళ్లుగా మా ఊరిని ఖాళీ చేయించి, మమ్మల్ని మరో చోటుకి తరలిస్తామని చెబుతున్నారు. ఈ ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుంది, పరిహారం ఎప్పుడు అందుతుందన్న దానిపై ఎవరికీ స్పష్టత లేదు. పునరావాసం కల్పిస్తే అక్కడ జీవనోపాధి కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలి.

– పోషప్ప, కుడిచింతల్‌బైల్, అమ్రాబాద్ మండలం

స్వచ్ఛందంగా తరలింపు..



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్న ఆవాసాల్లో ఉంటున్న వారిని అడవి బయట పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తరలింపు ప్రక్రియ స్వచ్ఛందంగా అంగీకారం తెలిపిన వారికే చేపడతాం. పునరావాసం కింద రూ.15 లక్షల ఆర్థిక సహాయం, లేదా 2 హెక్టార్ల భూమి కేటాయింపు ఉంటుంది.

– రోహిత్ గోపిడి, జిల్లా అటవీశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



జిల్లాకేంద్రంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజు

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబకలహాల వల్ల మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన రాజుకు భార్యతో కుటుంబకలహాలు చోటుచేసుకున్నాయి. మనస్థాపానికి గురై జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరకొని రాజును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆత్మహత్యాయత్నాకి పాల్పడిన రాజు జేబులో సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా కుటుంబకలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుడికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

బస్టాండులో అనాథ వృద్ధుడు మృతి

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వట్టెం గ్రామానికి చెందిన అనాథ వృద్ధుడు గోవింద్ (65) మృతి చెందిన సంఘటన బుధవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. బిజినేపల్లి రెండో ఎస్‌ఐ రాజశేఖర్ మృతదేహాన్ని గుర్తించి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడికి కుటుంబ సభ్యులు లేకపోవడంతో భోజనం లేక అనారోగ్యంతో చనిపోయినట్లు పలువురు అనుమానిస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

దీపనగండ్ల: కుటుంబ కలహాల వల్ల ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాణి వివరాల ప్రకారం.. మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన రాచాల శ్రీనివాస్‌గౌడ్ (50) కొన్ని నెలలుగా భార్య, పిల్లలతో మహబూబ్‌నగర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. తమ సమీప బంధువు చనిపోవడంతో వారు ఇటీవల బొల్లారం గ్రామానికి వచ్చారు. బుధవారం ఉదయం కుటుంబంలో నెలకొన్న ఆస్తి పంపకాల విషయంలో ఆవేశానికి గురైన శ్రీనివాస్‌గౌడ్ తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడు..

అడ్డాకుల: మండల కేంద్రం శివారులో ఎస్ఎస్‌వీ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌కు చెందిన వినిత్ అడ్డాకుల సమీపంలోని ఎస్ఎస్‌వీ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతని మేనమామ లఖాన్(51) ఇక్కడే పని చేసేందుకు కొన్నాళ్ల క్రితం వచ్చాడు. అతనిని పనికి పెట్టుకోకపోవడంతో మేనల్లుడి వద్దే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన లఖాన్ బుధవారం కార్మికులందరు పనిలోకి వెళ్లిన తర్వాత క్వార్టర్స్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా గమనించిన కార్మికులు మృతదేహాన్ని బయటకు తీశారు. మేనల్లుడు వినిత్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిమ్మాజిపేట: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, బాధితుల వివరాల ప్రకారం.. భూత్పూర్ మండలం భట్టుపల్లి తండాకు చెందిన సంధ్య(22)ను, తిమ్మాజిపేట మండలం గొరిట తండాకు చెందిన పాత్లావత్ జగన్‌కు ఇచ్చి 2023 మేలో వివాహం చేశారు. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. అదనపు కట్నం కోసం భర్త వేధించేవాడు. మంగళవారం రాత్రి కూతురు చనిపోయిందని, జడ్చర్ల ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు తల్లికి సమాచారం అందించారు. సంధ్యకు భర్త, 11నెలల కూతురు ఉంది. అదనపు కట్నం కోసమే తమ కూతుర్ని హత్య చేశారని తల్లి అంజమ్మ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు



ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న రైతు మల్లయ్య

ఉదండాపూర్ నిర్వాసితుల ఆందోళన

- భిక్షాటనకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు

జడ్చర్ల టౌన్: పాలమూరు ప్రాజెక్టులోని ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులు, రైతుల పోరాటం రోజురోజుకు ఉధృతంగా మారుతోంది. పది రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్న వారు బుధవారం పదుల సంఖ్యలో కావేరమ్మపేట వద్ద ఉన్న ప్రభుత్వ అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. వినూత్నంగా నిరసన చేపట్టాలని నిర్ణయించి భిక్షాటన చేయాలని భావించారు. విషయం తెలుసుకున్న సీఐ కమలాకర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. అనుమతి లేదని.. గురువారం ఆర్డీఓ ఉదండాపూర్ గ్రామానికి వచ్చి మాట్లాడతారని చెప్పారు. అప్పటికీ అంగీకారం కుదరకుంటే అప్పుడు అనుమతిస్తామని నచ్చజెప్పారు. ఈ సమయంలో కాసేపు సీఐ, నిర్వాసితుల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది.

రైతు ఆత్మహత్యాయత్నం..

భిక్షాటనకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని పోలీసులు తేల్చిచెప్పడంతో మల్లయ్య అనే రైతు వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకోగా గుర్తించిన పోలీసులు వెంటనే అతడిని అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శాంతియుతంగా భిక్షాటన చేస్తామని నిర్వాసితులు పోలీసులతో వాదనకు దిగారు. తప్పనిసరి పరిస్థితుల్లో జడ్చర్ల పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీకి అనుమతించారు. నిర్వాసితులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ అతిథి గృహం నుంచి స్టేషన్ వరకు ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో భిక్షాటన చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనుమతి లేకుండా ఆందోళన చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని డీఎస్పీ హెచ్చరించినా వారు వినలేదు. గురువారం భిక్షాటన చేసి తీరుతామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సర్వే చేసి అనర్హులను ఏరేస్తాం : ఎమ్మెల్యే

ఉదండాపూర్ గ్రామంలో తప్పనిసరిగా సర్వే చేసి అందులో అనర్హులుంటే ఏరి వేసి నిజమైన నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పుర పరిధిలోని పాతబజార్‌లో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉదండాపూర్‌లో సర్వే జరిగితే తమ దొంగతనం బయటపడుతుందని బీఆర్‌ఎస్ నాయకులే అడ్డుకుంటున్నారని విమర్శించారు. వల్లూరులో 1,005 మంది రైతులు ఉన్నట్లుగా రికార్డు ఉందని.. సర్వే చేపట్టగా అర్హులు కేవలం 574 మంది మాత్రమే ఉన్నట్లు తేలిందని వివరించారు. మిగిలిన వారంతా బీఆర్‌ఎస్ నాయకులు చేర్చిన బోగస్ లబ్ధిదారులన్నారు. అదేవిధంగా ఉదండాపూర్‌లోనూ సర్వే చేపడితే వారి బాగోతాలు బయటపడతాయనే భయంతో అడ్డుకుంటున్నారని.. ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వే చేపడతామని తెలిపారు. సర్వే జరిగితే అవార్డు పాసవుతుందని.. ఆరునెలల్లోగా పరిహారం చేతికందుతుందని వివరించారు. తను ఎమ్మెల్యే అయ్యాక తండావాసులకు రూ.41 కోట్లు విడుదల చేయించానని.. మరో రూ.71 కోట్లు కలెక్టర్ ఖాతాలో చేసినట్లు చెప్పారు. తనది రైతు పక్షపాతమని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లిందని, త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు.

భక్తుల పాలిట కల్పవల్లి.. పోలేపల్లి ఎల్లమ్మ తల్లి



ముస్తాబైన పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం

- మినీ మేడారంగా పోలేపల్లి జాతర
- స్వయంభూగా ఎల్లమ్మ అమ్మవారు
- నేటి నుంచి 24 వరకు బ్రహ్మోత్సవాలు
- 21న పీడీకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్, ఎస్పీ

కోస్గి: భక్తుల పాలిట కల్పవల్లిగా పోలేపల్లి ఎల్లమ్మ తల్లి బాసిల్లుతోంది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి స్వయంభూగా వెలిశారు. రాష్ట్రంలో మేడారం తర్వాత అంతటి ఆదరణ ఉన్నది పోలెపల్లి జాతర మాత్రమే. మినీ మేడారంగా ఈ జాతర ప్రసిద్ధికెక్కింది. గురువారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు అమ్మవారి జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటుగా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రతో పాటు సూరత్, అహ్మదాబాద్ నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు, పాలకవర్గం సభ్యులు తెలిపారు. ఇప్పటికే వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అన్ని శాఖలతో అధికారులతో సమావేశం నిర్వహించారు. వారికి దిశానిర్దేశం చేశారు.



అమ్మవారి విగ్రహం

హెలీప్యాడ్ సిద్ధం

మిని మేడారంగా పేరొందిన పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు 21వ తేదీన జరిగే షిడే ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై అమ్మవారి దర్శించుకుంటున్నారు. ఇప్పటికే రెండు వరుసల రోడ్లు పూర్తిచేశారు. సీఎం రాక కోసం హెలీప్యాడ్ సిద్ధం చేశారు.

ప్రత్యేక బస్సులు..

పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుండటంతో తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేకంగా నారాయణపేట, కోస్గి, తాండూర్, పరిగి డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేయనుంది. ప్రైవేటు వాహనాల్లో వచ్చే భక్తులకు దేవస్థాన కమిటీ పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయిస్తుంది.

అమ్మవారి షిడే ప్రత్యేకం

పోలేపల్లి ఎల్లమ్మ అంటే దశాబ్దాల నుంచి ప్రత్యేకత సంతరించుకుంది. జాతరలో ఇక్కడ అమ్మవారి షిడే ప్రత్యేకం. గతంలో జాతరలో సిడేకు ఒక జోగు మహిళను కట్టి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించేవారు. పదేళ్లుగా తొట్టెనె కట్టి అందులో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ప్రదక్షిణ చేయిస్తున్నారు. షిడే, రథం ఏళ్ల కిందటి కావటంతో శిథిలావస్థకు చేరాయని భావించిన దాతలు రూ.10లక్షలతో అమ్మవారి సిడే , రూ.14 లక్షలతో రథాన్ని ఆలయానికి అందజేశారు. ఈ ఎడాది బ్రహ్మోత్సవాల్లో వీటిని వినియోగిస్తున్నట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. 22వ తేదీన తేరు, 23న రథోత్సవం, 23న ప్రత్యేక పూజలు, 24న గ్రామంలో పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయి.

అభివృద్ధే చరిత్రలో నిలిచిపోతుంది



పెద్దరేవల్లిలో చత్రపతి శివాజి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ అరుణ ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి తదితరులు.

- ఎంపీ డీకే అరుణ
- సమష్టి కృషితోనే అభివృద్ధి : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- పెద్దరేవల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ

రాజాపూర్(బాలానగర్): ప్రభుత్వాలు మారుతుంటాయి కానీ చేసిన అభివృద్ధే చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లిలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ విగ్రహాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చత్రపతి శివాజీకి ఆయన తల్లి ధైర్యాన్ని నూరిపోసిందన్నారు. యువతకు ఆయన పెద్దస్ఫూర్తి అన్నారు. పాలమూరు జిల్లా కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు సీఎం వెనుకబడ్డ జిల్లాపై దృష్టి సారించాలన్నారు. ఉదండపూర్ రైతులు భూములు, ఇళ్లు కోల్పోయారని వారికి పరిహారం అందించాలని కోరారు. పార్టీలు పక్కనపెట్టి సమష్టి కృషితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శివాజీ విగ్రహాన్ని చూస్తే యువతలో స్ఫూర్తి రావాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు నష్టపోయిన ఉదండపూర్ వాసులకు అండగా ఉంటాన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదిరమణారెడ్డి, సాధువెంకట్‌రెడ్డి, యాదయ్యగౌడ్, తిరుపతి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సాహితీరెడ్డి, లింగారెడ్డి, నందీశ్వర్, శ్రీనివాస్ నాయక్, కోటజనార్దన్, మహేందర్‌రెడ్డి, వెంకట్ బాలవర్ధన్‌గౌడ్, లక్ష్మీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల ప్రకాశ్ మృతి



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్, డీసీసీ మాజీ అధ్యక్షుడు ముత్యాల ప్రకాశ్ (77) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన పలు పదవులను అధిరోహించారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో ప్రకాశ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేశారు. 1981లో మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలుపొందారు. మహబూబ్‌నగర్ సూపర్‌బజార్ చైర్మన్, రీజినల్ ఫిలిం సెన్సార్ బోర్డుమెంబర్‌గా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా పని చేశారు. 1999–2004 వరకు మున్సిపల్ చైర్మన్‌గా, 2005–2012 వరకు డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. 2012లో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన ప్రకాశ్ మృతిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడులో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 24 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 130 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

నమ్మించి.. మోసం చేశారు

- సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కుకున్న బాధితుడు
- పోలీసులకు ఫిర్యాదు

మిడ్జిల్: ఎలాంటి ఆర్థిక సాయం కావాలన్న తమను సంప్రదించండి అంటూ సోషల్ మీడియా ప్రకటనలు వెల్లువలా కనిపిస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో కొందరు వీరిని నమ్మి మోసపోతుంటారు. ఇలాంటే సైబర్ మోసానికి గురైన ఘటన బుధవారం మిడ్జిల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు తండ్రి జంగయ్య గతేడాది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రుల్లో చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఇన్‌స్టాలో హర్షసాయి ఐడీతో ఉన్న గ్రూప్‌లో సహాయం కావాలని ఆంజనేయులు కోరాడు. ఇది గమనించిన కేటుగాళ్లు హర్షసాయి ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని, రూ.4లక్షలు సహాయం చేస్తామని ఆంజనేయులును నమ్మించారు. డాక్యుమెంట్ చార్జి, ఆఫీస్ బ్యాక్ ఎండ్ చార్జి ఉంటాయని మీరు డబ్బులు పంపితే వెంటనే సహాయం అందుతుందని తెలిపారు. నిజమేనని నమ్మిన బాధితుడు ఆంజనేయులు వారిచ్చిన నంబర్లకు మంగళవారం సాయంత్రం ఫోన్‌పే ద్వారా ఐదు విడుతల్లో రూ.22,500 పంపించాడు. సహాయం కావాలని బాధితుడు పదేపదే ఫోన్ చేయగా బుధవారం ఉదయం కేటుగాళ్లు రూ.5,500 తిరిగి పంపించారు. తర్వాత వారు ఇచ్చిన ఫోన్ నంబర్లు స్విచాఫ్ అయ్యాయి. మోసపోయానని భావించిన బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీ : వ్యక్తి మృతి

శాంతినగర్: ట్రాక్టర్‌ను మోటార్ సైకిల్ ఢీ కొట్టిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వడ్డేపల్లి మండలం జూలెకల్ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జూలెకల్ శివారులో ట్రాక్టర్‌లో డీజిల్ అయిపోవడంతో రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్ వెళ్లాడు. ఈ క్రమంలో శాంతినగర్ నుంచి అయిజ వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి(50) ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

మోకాళ్లపై నడుస్తూ శ్రీశైలానికి యాత్ర

దోమలపెంట: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం మారేపల్లికి చెందిన శివమాలధారుడు 63 ఏళ్ల బాలనాగయ్య మోకాళ్లపై నడుస్తూ శ్రీశైలానికి బయలుదేరారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక అయ్యప్ప ఆలయంలో సేద తీరుతుండగా గ్రామస్తులు పలువురు ఆయనతో మాట్లాడగా వివరాలు వెల్లడించారు. నాలుగేళ్ల కిందట శివమాల ధరించి మోకాళ్లపై నడుస్తూ శ్రీశైలానికి బయలుదేరానని.. ఉమామహేశ్వరం కమాన్ వద్దకు చేరుకోగానే అస్వస్థతకు గురికావడంతో యాత్ర ముగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడటంలో ఈ నెల 10న తిరిగి ఉమామహేశ్వరం కమాన్ నుంచి యాత్ర ప్రారంభించినట్లు వివరించారు. ఆయన వెంట ఇద్దరు కుమారులు, శివదీక్షలో ఉన్న మరో నలుగురు ఉన్నట్లు చెప్పారు.



అతివేగానికి రెండు నిండు ప్రాణాలు బలి



ప్రమాదానికి కారణమైన కారు

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు యువకుల దుర్మరణం
- తాడూరు మండలం గుంతకోడూరు గేట్ సమీపంలో ఘటన



శేఖర్ (ఫైల్)



శ్రీనివాసులు (ఫైల్)

తాడూరు: అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన తాడూరు మండలం గుంతకోడూరు గేట్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి వివరాల మేరకు.. తెలకపల్లి మండలం అనంతసాగర్‌కు చెందిన అతినారపు శేఖర్ (31), శ్రీనివాసులు (42) బంధువులు. వీరిద్దరు హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఓ శుభకార్యంలో వారు పాల్గొని తిరిగి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. గుంతకోడూరు గేట్ సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి వీరి బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కనున్న మొక్కజొన్న పంటలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. శేఖర్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన తెలకపల్లి మండలం కార్వంగకు చెందిన రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇల్లు మా పేరిట రిజిస్ట్రేషన్ చేయించండి

- మమ్మల్ని కుమారులు, కూతుళ్లు పట్టించుకోవడం లేదు
- వయోవృద్ధుల సంక్షేమ కమిటీకి తల్లిదండ్రుల వేడుకోలు



మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆ వృద్ధ తల్లిదండ్రులకు తొమ్మిది మంది సంతానం.. వీరిలో ఐదుగురు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. అందరి పెళ్లిళ్లు చేసిన వారు చివరికి తమకున్న స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు గతంలో బ్యాంకు రుణం వస్తుందని భావించి మూడో కొడుకుకు రిజిస్ట్రేషన్ చేశారు. అయితే కొన్నాళ్లకు అతను తన అక్కకు బదిలీ చేయగా.. ఆ వృద్ధులను ఇప్పుడు ఎవరూ పట్టించుకోకపోవడంతో లబోదిబోమంటున్నారు. తమ గోడును బుధవారం నగర వయోవృద్ధుల సంక్షేమ కమిటీ ఎదుట వెళ్లబోసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన లక్ష్మమ్మ (65), సామర్ల రంగయ్య (70) దంపతులకు స్థానికంగా 133 గజాల స్థలం ఉంది. ఎనిమిదేళ్ల క్రితం తమకున్న అందులో మూడో కుమారుడు దత్తు బ్యాంకు ఉద్యోగి కావడంతో రుణం తీసుకుని ఇల్లు నిర్మించుకునేందుకు అతని పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే ఇటీవల కుటుంబ సభ్యుల సమ్మతి లేకుండానే తన అక్క వితంతువు తిరుపతమ్మ (స్టాఫ్‌నర్స్)కు మార్పిడి చేయించాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ వృద్ధ తల్లిదండ్రుల ఆలనా పాలనను మాత్రం ఎవరూ సరిగ్గా చూడటం లేదు. చివరకు ఇంటి మేడపైన ఉన్న సింగిల్ బెడ్‌రూంలో దివ్యాంగుడైన చివరి కుమారుడు రాజు వద్ద ఉంటున్నారు. ఈయనతో పాటు భార్యాపిల్లలు, వృద్ధ దంపతులకు ఏమాత్రం గదులు సరిపోక అవస్థలు పడుతున్నారు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలోనే వరండాలో చుట్టూ దేరాలు వేసుకుని నివసిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ఇంటిని తమ పేరిట మార్పిడి చేయించాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని అధికారులకు విన్నవించారు. స్పందించిన నగర వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్మన్ డి.మహేశ్వర్‌రెడ్డి, కమిటీ కన్వీనర్ సీడీపీఓ రాధిక, వన్‌టౌన్ సీఐ ఎం.అప్పయ్య, డా.మహమ్మద్ అస్గర్ అలీ, జి.నాగభూషణం, కె.జయప్రద సమావేశమయ్యారు. ఈకేసుకు సంబంధించిన కుటుంబసభ్యులందరినీ పిలిపించి పూర్వాపరాలను క్షుణ్ణంగా తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈనెల 23వ తేదీ వరకు తమకు గడువు ఇవ్వాలని, తమ తల్లిదండ్రుల సంరక్షణ కోసం ఒక అంగీకారానికి వస్తామని అధికారులకు కుటుంబసభ్యులు తెలిపారు.

DHANVANTHRI COLLEGE OF PHARMACEUTICAL SCIENCES
THIRUMALA HILLS, CENTRE CITY, APPANNAPALLY, MAHABUBNAGAR, TELANGANA - 509001
Ph: 9492501456/9010928928 Email : dhanvanthripc@yahoo.com
Approved by PCI, New Delhi and Govt of TG. Affiliated to PU, Mahabubnagar.
WANTED FACULTY
Applications are invited for the post of : 1.Professors/Associate Professors/Assistant Professors for B.Pharm,M.Pharm,Pharm.D a) Pharmaceutics b) Pharmaceutical Chemistry/Pharmaceutical Analysis c) Pharmacognosy d) Pharmacology e) Pharm.D
Eligible Candidates can apply to the under signed with in 15 days from the notification. Qualification and salary as per palamuru university & PCI norms
Dr.A.YASODHA Principal
P.NARENDER GUPTHA Secretary

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్

WANTED

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073

■ కర్నూలు సిటీ తుంగభద్ర నది సమీపంలో గల ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ మరియు ఫైర్ గార్డ్స్ కావలెను. జీతం: 12వేలు, 4 వీక్లీ ఆఫ్‌లు, 8 గంటలు డ్యూటీ. సంప్ర: 9494222218, 9494333443.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనల వివరాలను నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాలని మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే రీతి గురించి ... దానితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ ఖాతాల్లో ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్